క్లుప్తంగా

వెంకన్న అన్నదానానికి రూ.10 వేల విరాళం



ఆలయ చైర్‌పర్సన్ వీరీతాదేవికి విరాళాన్ని అందజేస్తున్న దాత వెంకటరమణ దంపతులు

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి అమలాపురం రామకృష్ణనగర్‌కు చెందిన అడపా వెంకటరమణ తన మనవడు కుశ్వంత్‌రామన్ పేరు మీద రూ.10 వేలు విరాళమిచ్చారు. ఈ మొత్తాన్ని ఆలయ చైర్ పర్సన్ దూడల వెంకట వీరీతాదేవికి బుధవారం అందజేశారు. అనంతరం దాత కుటుంబీకులకు వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ యువజన కమిటీ అధ్యక్షుడు దూడల ఫణి తదితరులు పాల్గొన్నారు.

నాసా ప్రాజెక్ట్ కాంటెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



విజేతలైన విద్యార్థులను అభినందిస్తున్న శ్రీచైతన్య స్కూలు యాజమాన్య ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఎస్ఎస్ఎస్–నాసా స్పేస్ కాంటెస్ట్‌లో స్థానిక శ్రీచైతన్య స్కూలు విద్యార్థులు దేశ స్థాయిలో ప్రతిభ చూపారని స్కూలు ప్రిన్సిపాల్ జి.వసు తెలిపారు. బుధవారం స్కూలులో జరిగిన అభినందన కార్యక్రమంలో కాంటెస్ట్‌లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచిన ఏడుగురు విద్యార్థులను ప్రిన్సిపాల్ వసుతో పాటు అకడమిక్ కోఆర్డినేటర్ వి.శ్రీకాంత్, రీజినల్ ఇన్‌చార్జి పి.శ్రీనివాస్ ప్రశంసించారు. కార్యక్రమంలో స్కూలు డీన్ టి.శ్రీనివాస్, సీ–ఇన్‌చార్జి జి.శ్రీనివాస్, మెడికాన్–నాసా ఇన్‌చార్జి అరవ శ్రీను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



జి.వేమవరం పీహెచ్‌సీలో వైద్య పరీక్షలకు హాజరైన గర్భిణులు

ఐ.పోలవరం: మండలంలోని కేశనకుర్రు, జి.వేమవరం పీహెచ్‌సీల్లో వైద్యులు బి.ఆదిత్య, ఇందిరాశ్రీ, శివగాయిత్రిలు 68 మంది గర్భిణులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆదిత్య మాట్లాడుతూ ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన(పీఎంఎస్‌ఎంవీ) సూచనలు, సలహాలు ప్రతి గర్భిణీ సద్వినియోగం చేసుకోవాలన్నారు. గర్భిణులు 9 నెలల పాటు ఒకే వైద్యుడి దగ్గర వైద్యం చేయించుకుంటే అన్నివిధాలా మంచిదని సూచించారు.

తహసీల్దార్ పోతురాజుకు సత్కారం



తహసీల్దార్ పోతురాజును సత్కరించిన రెవెన్యూ ఉద్యోగులు

తాళ్లరేవు: రాష్ట్ర రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ జిల్లా జాయింట్ సెక్రటరీగా ఎంపికైన తాళ్లరేవు తహసీల్దార్ ఎస్.పోతురాజును బుధవారం ఘనంగా సత్కరించారు. స్థానిక కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ఎం.సూరిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వీఆర్వోలు, సిబ్బంది తహసీల్దార్‌ను దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించి ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత పోతురాజు మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమానికి పాటుపడతానన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవితేజ, ఎంఎస్‌ఓ శ్రీనివాసరావు, మండల సర్వేయర్ సఫీ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ప్రజా సంఘాల ధర్నా

అమలాపురం టౌన్: కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ కార్పొరేట్లకు కొమ్ము కాస్తోందని ఆరోపిస్తూ పలు ప్రజా సంఘాలు స్థానిక కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా నిర్వహించాయి. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ప్రజా సంఘాల ప్రతినిధులు డీఆర్వో సీహెచ్ సత్తిబాబుకు అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి గుదే దుర్గా ప్రసాద్, సఖిలే సూర్యనారాయణ, ఇసుకపట్ల మంగాదేవి, నిమ్మకాయల వెంకటేష్, విప్పర్తి మోహనరావు తదితరులు ధర్నాలో పాల్గొన్నారు.

మాతాశిశువులకు పౌష్టికాహారం

- వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లతో ఎంతో మేలు
- గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారించడమే లక్ష్యం



గర్భిణులకు అందిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు

అల్లవరం: పండంటి బిడ్డకు జన్మనివ్వాలని కలలు గంటున్న మాతృమూర్తులను రక్తహీనత సమస్య వెంటాడుతుంది. పౌష్టికాహార లోపం మాతాశిశువులిద్దరికీ కీడు చేస్తుంది. అందుకే గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించే లక్ష్యంతో ప్రభుత్వం టేక్ హోమ్ రేషన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పేరుతో పది రకాల పోషకాలను కిట్ల రూపంలో ఇంటికే అందిస్తున్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా ఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వారా గర్భిణులు, బాలింతలను నమోదు చేసి పది రకాల పోషకాలను అందిస్తున్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా పోషకాహారం తీసుకోవడం వల్ల పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండేందుకు, బాలింతలకు సమృద్ధిగా పాలు ఉండేందుకు అవకాశమేర్పడుతుంది. గర్భిణిగా నమోదైన నాటి నుంచి పుట్టిన బిడ్డకు ఆరో నెల పూర్తయ్యే వరకూ సమతుల ఆహారాన్ని అందిస్తున్నారు. ఆరు నెలల నుంచి మూడేళ్ల లోపు పిల్లలకు బాలామృతంతో పాటు గుడ్లు, పాలు ఇస్తున్నారు.

అందిస్తున్న పోషకాహారమిదే

వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ రేషన్ ద్వారా నెలకోసారి లబ్ధిదారులకు 3 కేజీల బియ్యం(పోర్టిఫైడ్ పోషకాలు కలిసిన బియ్యం), 1 కేజీ కందిపప్పు, 500 ఎంఎల్ ఆయిల్, 25 గుడ్లు, 5 లీటర్ల పాలు, 2 కేజీల రాగి పిండి, 1 కేజీ అటుకులు, పావుకేజీ చొప్పున చిక్కీలు, ఖర్జురం, బెల్లం ఇస్తున్నారు.

ప్రభుత్వానికి ధన్యవాదాలు



వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ రేషన్ ద్వారా అంగన్‌వాడీ సిబ్బంది పోషకాలతో కూడిన సరకులను ఇంటికే తెచ్చి అందిస్తున్నారు. తల్లీబిడ్డల ఆరోగ్యం కోసం సమతుల ఆహారాన్ని అందిస్తున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– వెల్లి సంధ్య, ఎంట్రుకోన గ్రామం, అల్లవరం మండలం

ఎంతో ఉపయోగం



వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమం ద్వారా పది రకాల పోషకాలను ఇంటికే తెచ్చి అందించడం చాలా బాగుంది. ఆర్థికంగా వెనకబడిన వారికి ఈ పోషకాహారం ఎంతో ఉపయోగపడుతుంది.

– పిల్లి స్వర్ణలత, బెండమూర్లంక గ్రామం

మాతాశిశువులకు ఎంతో మేలు

వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత లోపాన్ని నివారించొచ్చు. గర్భిణిగా నమోదైన నాటి నుంచి ఆరో నెల బాలింత వరకూ ఇంటికే సరకులను అందిస్తున్నాం. దీనివల్ల మాతాశిశువులకు ఎంతో మేలు.

– కె.విజయకుమారి, సీడీపీఓ, అమలాపురం

గద్దర్‌కు ఘన నివాళి



ఐ.పోలవరంలో గద్దర్‌కు నివాళులర్పిస్తున్న అభిమానులు

ఐ.పోలవరం: స్థానిక శాఖా గ్రంథాలయం వద్ద పుల్లెల తాతయ్య మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రజా గాయకుడు గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ గద్దర్ పీడిత ప్రజల గుండె చప్పుడని కొనియాడారు. కార్యక్రమంలో రేవు రాజేంద్రప్రసాద్, డి.రాఘవరాజు, బి.గోవిందరావు, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: స్థానిక గడియారం స్తంభం సెంటరులో ఎస్‌జేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ప్రజా గాయకుడు గద్దర్ సంతాప కార్యక్రమం బుధవారం జరిగింది. గద్దర్ చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు గున్నేపల్లి భీమశంకరం, షేక్ కరీముల్లా బాబా, మోర్త శ్యామ్, శంకరపు సత్య ప్రసాద్ శేఖర్ తదితరులు ప్రసంగించారు. స్థానిక గడియారం స్తంభం సెంటరులో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సంతాప సభను బుధవారం నిర్వహించింది. నియోజకవర్గ పార్టీ కన్వీనర్ మహ్మద్ ఆరిఫ్ అధ్యక్షతన జరిగిన సంతాప సభలో పట్టణ పార్టీ అధ్యక్షుడు వంటెద్దు బాబి, డాక్టర్ దేవరపల్లి రాజేంద్రబాబు, యార్లగడ్డ రవీంద్ర, అయితాబత్తుల సుభాషిణి, వడ్డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సభను జయప్రదం చేయాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు

అల్లవరం: ఈ నెల 11 న అమలాపురం బాలయోగి పార్కులో నిర్వహించనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభను జయప్రదం చేయాలని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు పిలుపునిచ్చారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఎంపీడీఓ కృష్ణమోహన్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శేషగిరిరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్వయం సహాయక సంఘాలకు సున్నా వడ్డీ రాయితీని పంపిణీ చేయనున్న నేపథ్యంలో డ్వాక్రా సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున హాజరయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం సయ్యద్, ఏపీఓ శ్రీనుబాబు, విస్తరణాధికారి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ



గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేసిన ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

ముమ్మిడివరం: గర్భిణులు, బాలింతల్లో తరచుగా వచ్చే రక్తహీనతను అధిగమించేందుకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు ఎంతో దోహదం చేస్తాయని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రభుత్వం అందించే పది రకాల ఆహార దినుసులు కల్గిన పోషకాహార కిట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణకు అధిక ప్రాధాన్యమిస్తుందన్నారు. అనంతరం 20 మందికి గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, ఎంపీపీ కోలా గంగాభవాని, జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, జిల్లా స్త్రీశిశు సంక్షేమ సాధికారిక అధికారి జీవీ సత్యవాణి, ఏఎంసీ చైర్మన్ కుడిపూడి శివన్నారాయణ, పెయ్యల చిట్టిబాబు, బొంతు సత్యశ్రీనివాస్, పాము నాగవేణి తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలు అమృతంతో సమానం



గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్న మహిళా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: పుట్టిన బిడ్డలకు తల్లిపాలు ఇవ్వడమంటే అమృతంతో సమానమని మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పుత్సా రాజేశ్వరి అన్నారు. స్థానిక చల్లావారి వీధిలోని అర్బన్ హెల్త్ సెంటరులో అమలాపురం మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతి తల్లి తన బిడ్డకు తల్లి పాలు అందించాలని సూచించారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహారాన్ని మహిళా వాకర్స్ అందించారు. కార్యక్రమంలో డాక్టర్ సంసాని నిహారిక, డాక్టర్ లత, మహిళా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు యర్రమిల్లి అనంతలక్ష్మి, కూచిమంచి నాగమణి, యర్రమిల్లి రామ తులసి, భమిడిపాటి పద్మావతి, బులుసు కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రంగరాజుకోడు తవ్వకాల పరిశీలన



రంగరాజుకోడు మీడియం డ్రెయిన్ తవ్వకాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వరి తదితరులు

ఉప్పలగుప్తం: మండలంలోని కూనవరం నుంచి నంగవరం శివారు వరకూ 6.2 కిలోమీటర్ల మేర జరుగుతున్న రంగరాజుకోడు మీడియం డ్రైన్ తవ్వకాలను తహసీల్దార్ జె.వెంకటేశ్వరి బుధవారం పరిశీలించారు. ముంపు నీరు దిగక రైతులు ఇబ్బందులు పడటంతో రూ.94 లక్షల నిధులతో తవ్వకాలు జరుగుతున్నాయన్నారు. దాదాపుగా 50 శాతం పనులు పూర్తయ్యాయ్యని, కాలువ వెంబడి ఉన్న ఆక్రమణలను పూర్తిస్థాయిలో తొలగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ హార్టికల్చర్ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, శీలం సూరిబాబు, డీటీ వైవీవీఎస్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కోనసీమ అండర్–11 చెస్ పోటీలు



రాష్ట్ర అండర్–11 పోటీలకు ఎంపికయిన విద్యార్థులతో లయన్స్ క్లబ్ ప్రతినిధులు

అమలాపురం రూరల్: కోనసీమ జిల్లా చెస్ అసోషియేషన్ ఆధ్వర్యంలో అండర్–11 చెస్ పోటీలు అమలాపురం లయన్స్ క్లబ్‌లో ఉత్సాహంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన చిన్నారులతో సందడి వాతావరణం నెలకొంది. ఈ పోటీల ద్వారా ఇద్దరు బాలికలు, ఇద్దరు బాలురను శ్రీకాకుళంలో జరగనున్న రాష్ట్ర అండర్–11 పోటీలకు ఎంపిక చేసినట్లు కోనసీమ చెస్ సెక్రటరీ తాడి వెంకట సురేష్ తెలిపారు. ఎంపికయిన విద్యార్థులు గుత్తుల వెంకట శివరామ్, పితాని ధ్యానసత్య కార్తీక్, గెద్దాడ దేవిఅక్షయ, నూకపెయ్యి హన్వికలకు లయన్స్ క్లబ్ ప్రతినిధులు గోకవరపు మల్లికార్జున స్వామి, చిక్కాల సతీష్, తాడి శ్రీదేవి బహుమతులను అందజేశారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ



స్కౌట్స్ శిక్షణలో చేరిన విద్యార్థులను ఆహ్వానిస్తున్న గోపాలకృష్ణ

రాజోలు: సేవాభావాన్ని విద్యార్థుల్లో అలవాటు చేసేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని రిటైర్డ్ ఎంఈఓ జొన్నలగడ్డ గోపాలకృష్ణ అన్నారు. బుధవారం రాజోలు బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరిన విద్యార్థులను ఆహ్వానించి దీక్షా ప్రమాణం చేయించారు. స్కౌట్స్ పతాకాన్ని ఎగరవేశారు. ప్రధానోపాధ్యాయుడు డి.హరనాథ్, కట్టా కృష్ణప్రసాద్, యెరుబండి నాగేశ్వరరావు, ఎ.శ్రీమన్నారాయణ, విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌ను జయప్రదం చేయండి



పటవలలో శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు



నా భూమి–నా దేశం శిలాఫలకం ఆవిష్కరించిన ఎంపీపీ శేషగిరిరావు



పాతయింజరంలో మొక్కలు నాటిన ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి

తాళ్లరేవు: మండలంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తాళ్లరేవు ఎంపీపీ రాయుడు సునీత కోరారు. బుధవారం పటవల గ్రామ పంచాయతీలో ఆమె 'నా భూమి– నా దేశం' శిలాఫలకం ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో కొబ్బరి మొక్కలు నాటడంతో పాటు పంచ ప్రాణ్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సునీత మాట్లాడుతూ ప్రతి గ్రామం నుంచి మట్టిని సేకరించి ఢిల్లీకి పంపిస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్‌సాగర్, పటవల సర్పంచ్ పినపోతు చిన కామేశ్వరరావు, ఏపీఎం పెండ్యాల అన్నపూర్ణ, పంచాయతీ కార్యదర్శి జేవీ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వీరులకు వందనం

అల్లవరం: మాతృభూమికి స్వాతంత్ర్యం తెచ్చేందుకు ప్రాణత్యాగం చేసిన వీరులందరికీ వందనమని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. నా మట్టి–నా దేశం, నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమం బెండమూర్లంక గ్రామంలో బుధవారం నిర్వహించారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ వేడుకల్లో భాగంగా నా భూమి–నా దేశం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వడ్డి గంగ, సర్పంచ్ బత్రే సీతారత్నం, ముత్యాల వెంకట రామకృష్ణ, కోఆప్షన్ సభ్యులు పల్లి జేమ్స్‌రాజు, గుత్రం చిన్నబ్బాయి, ఎంపీడీఓ కృష్ణమోహన్, ఏపీఓ శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు. నా భూమి– నా దేశం కార్యక్రమంలో భాగంగా ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో సర్పంచ్ మల్లాడి మంగాయమ్మ మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు.

భావితరాల కోసం మొక్కలు నాటాలి

ఐ.పోలవరం: భావితరాలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించేందుకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకల్లో భాగంగా బుధవారం పాతయింజరంలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మొక్కలు నాటారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 9 నుంచి 15 వరకూ జరగనున్న 'నా భూమి–నా దేశం', 'నేల తల్లికి వందనం–వీరులకు వందనం', ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకలు బుధవారం మండలంలోని ప్రతి గ్రామంలో ఘనంగా ప్రారంభమయ్యాయని ఎంపీడీఓ డి.రాంబాబు అన్నారు. పాతయింజరంలో తహసీల్దార్ ఝాన్సీకుమారి, జి.మూలపొలంలో కాటం సత్తిరాజు, కేశనకుర్రులో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, ఇందుకూరి రంగరాజు తదితరులు పాల్గొని మొక్కలు నాటారు.

ఇందిరా అనురాధకు పురస్కారం



ఇందిరా అనురాధకు పురస్కారం అందజేస్తున్న సంఘ సభ్యులు

ముమ్మిడివరం: ఆధ్యాత్మిక ప్రవచనకర్త డింగిరి ఇందిరా అనురాధకు ఆధ్మాత్మిక ప్రవచన మణి పురస్కారం లభించింది. ఇటీవల ఏలూరులో రాష్ట్ర అఖిల భారత బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంఘ సభ్యుల చేతుల మీదుగా ఆమె పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఇందిరా అనురాధను పలువురు అభినందించారు.

కాపు నేతలకు సత్కారాలు



కాపు ఉద్యమ నేతలు విష్ణుమూర్తి, పవన్‌కుమార్‌లను సత్కరిస్తున్న కాపు నాయకులు

అమలాపురం టౌన్: కాపు సంక్షేమ సేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అమలాపురంలోని పలువురు కాపు ఉద్యమ నేతలను బుధవారం వేర్వేరుగా సత్కరించారు. తొలుత స్థానిక రాతి బడి సెంటరులో రాష్ట్ర కాపు రిజర్వేషన్ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నల్లా విష్ణుమూర్తి, కాపు రాష్ట్ర జేఏసీ నాయకుడు నల్లా పవన్ కుమార్‌లను, అనంతరం స్థానిక కల్వకొలనువీధిలో కోనసీమ కాపు జేఏసీ చైర్మన్ కల్వకొలను తాతాజీని కాపు నాయకులు సత్కరించారు. కార్యక్రమాల్లో కాపు సంక్షేమ సేన నాయకులు బసవా చినబాబు, పోలిశెట్టి బాబులు, రంకిరెడ్డి అబ్బులు, మేడిది శంకర్, తిక్కా శేషుబాబు పాల్గొన్నారు.

రెండో రోజు దాఖలైన నామినేషన్లు

తాళ్లరేవు: మండల పరిధిలోని నీలపల్లి గ్రామ పంచాయతీ 2వ వార్డుకి సంబంధించి బుధవారం ఒక నామినేషన్ దాఖలైంది. గ్రామానికి చెందిన కుడుపూడి శివన్నారాయణ 2వ వార్డుకు సంబంధించి తన నామినేషన్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి గంగాధర్‌కు సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ చిట్టూరి నాగమణి తదితరులు పాల్గొన్నారు. తాళ్లరేవు 11వ వార్డు మెంబర్ స్థానానికి ఆర్.రాజు నామినేషన్ దాఖలు చేశారు. రిటర్నింగ్ అధికారి పి.సత్యనారాయణకు నామినేషన్‌ను అందజేశారు.

అమలాపురం రూరల్: ఈదరపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఐదో వార్డు మెంబర్ స్థానానికి కొప్పుల సత్య బుధవారం పంచాయతీ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు.

కలెక్టర్‌ను కలిసిన బాధితులు



కలెక్టరేట్ వద్ద ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబులతో తొత్తరమూడి బాధితులు

అమలాపురం రూరల్: అయినవిల్లి మండలం తొత్తరమూడి గ్రామ పరిధిలో అర్చకుల వద్ద కొనుగోలు చేసిన భూమిలో నివాసితులైన బాధితులు ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబుల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ హిమన్షు శుక్లాను కలిసి తమను ఆదుకోవాలంటూ వేడుకున్నారు. మంగళవారం కోనసీమ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు తెలిపారు.

రాష్ట్రపతిని కలిసిన శాసనసభ్యుల బృందం



రాష్ట్రపతి ముర్మును కలిసిన శాసనసభ్యుల బృందం

యానాం: పుదుచ్చేరికి వచ్చిన రాష్ట్రపతి ద్రౌపది ముర్మును స్పీకర్ సెల్వం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేల బృందం బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. ఈ సందర్భంగా శాసనసభ్యలను పేరుపేరునా రాష్ట్రపతికి ముర్ముకు స్పీకర్ సెల్వం పరిచయం చేశారు. కార్యక్రమంలో యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, పుదుచ్చేరి శాసనసభ్యులు శివశంకర్, రిచర్డ్‌జాన్‌కుమార్, నామినేటెడ్ ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయాలి

అల్లవరం: హైదరాబాద్‌లో జరగనున్న మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని జిల్లా అధికార ప్రతినిధి ఆకుమర్తి రమేష్ మాదిగ పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ అమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆకుమర్తి మోహన్ అధ్యక్షతన గోడిలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో లూటుకుర్తి చినమాదిగ, యార్లగడ్డ రామకృష్ణ, ఆకుమర్తి సాయిబాబు, లక్ష్మణరావు, ఏసుబాబు వెంకన్న, సంపదరావు, వర్మ, ప్రసాద్ పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం

అల్లవరం: మండలంలోని రెల్లుగడ్డ పంచాయతీ పరిధిలో ఎంపీపీ స్కూల్‌ని ఆనుకుని గంటూరి సూరయమ్మకు చెందిన తాటాకిల్లు బుధవారం రాత్రి అగ్ని ప్రమాదానికి గురైంది. మంటల్లో సర్వస్వం కాలిపోయాయని, బాధితురాలికి కట్టుబట్టలు మినహా ఏమీ మిగల్లేదని స్థానికులు చెబుతున్నారు. అమలాపురం నుంచి అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు.

'నవోదయ' దరఖాస్తుల స్వీకరణకు గడువు పెంపు

అమలాపురం టౌన్: పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాలయలో 2024–25 సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశం కోసం ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 17వ తేదీ వరకూ గడువు పెంచినట్లు ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. నవోదయ విద్యాలయ సమితి ఆదేశాల మేరకు ఈ పొడిగింపు జరిగిందని, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన విద్యార్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. 2024 జనవరి 20వ తేదీన జరగబోయే ప్రవేశ పరీక్షకు హాజరు కావాలని ఆయన సూచించారు.